
ప్రశాంతంగా సైన్స్ పరీక్ష

వికారాబాద్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో సోమవారం జరిగిన పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ బయోలాజికల్ సైన్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్షకు 3328 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, వారిలో 2944 మంది హాజరయ్యారు కాగా, 384 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల్లో 88.46 శాతం హాజరయ్యారు.

ఇంతలో ఎంత తేడా.. 2023 డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీలతో విజయ ఢంకా మోగించిన కాంగ్రెస్ పార్టీ ఈ ఏడాది మేలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బోల్తా కొట్టింది. చేవెళ్ల లోక్‌సభ స్థానంలో ఆ పార్టీకి తక్కువ ఓట్లు రావడం, అభ్యర్థి ఓటమి చెందడంపై పార్టీ నేతలు అంతర్మథనంలో పడ్డారు. ఈ స్థానం పరిధిలో ఒక్క అసెంబ్లీ నియోజకవర్గంలోనూ గెలవని బీజేపీ లోక్‌సభ ఎన్నికల్లో భారీ మెజారిటీతో ఎలా గెలిచింది. ఇంత తక్కువ సమయంలో ఫలితాలు ఎందుకు తారుమారయ్యాయి. ఎక్కడ లోపం జరిగింది.. నాయకులు, కార్యకర్తలు కలిసి పనిచేశారా..లేదా?. అన్న వివరాలను సేకరించే పనిలో పడింది కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం. ఓటమికి గలకారణాల అన్వేషణలో పార్టీ అధిష్ఠానం బిజీగా ఉంది.



- ఓట్ల వేటలో ఎందుకు వెనకపడ్డాం
- ఎక్కడ లోపం జరిగింది..
- పోలింగ్ కేంద్రాల వారీగా లెక్కలు
- బీజేపీకి అంత మెజారిటీకి కారణాలేంటి
- ఫలితాల విశ్లేషణలో కాంగ్రెస్ అధిష్ఠానం
- చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గంలో ఓటమికి కారణాలపై ఆరా




ఎందుకిలా!

హస్తంలో అంతర్మథనం!

ఆంధ్రజ్యోతి, వికారాబాద్/రంగారెడ్డి అర్బన్, జూన్10 : అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్మథనం మొదలైంది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా.. చేవెళ్ల పార్లమెంట్ స్థానంలో ఓడిపోవడం పార్టీ అధిష్ఠానం ఆరా తీస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటిన కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల్లో చతికిల పడటంతో నాయకులు అంతర్మథనంలో పడ్డారు. గెలుపు అంచనాలు తలకిందులు కావడానికి గల కారణాలను విశ్లేషిస్తున్నారు. గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్, బీజేపీ నాయకులు ముందుకు సాగారు. విజయం మాత్రం కమలం పార్టీని వరించింది. 24 రౌండ్ల ఓట్ల లెక్కింపులో అన్ని రౌండ్లలో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆధిక్యతను చాటుకోవడం అందరినీని ఆశ్చర్యానికి గురి చేసింది. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజవర్గాలున్నాయి. అందులో గత అసెంబ్లీ ఎన్నికల్లో వికారాబాద్ జిల్లాలోని వికారాబాద్, పరిగి, తాండూరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో హస్తం పార్టీ హవా చాటింది. రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల, మహేశ్వరం, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ నియోజకవర్గాలు బీఆర్ఎస్ పార్టీ తన ఖాతాల్లో వేసుకుంది. ఇటీవలే జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వికారాబాద్ అసెంబ్లీ స్థానంలో స్వల్ప ఓట్ల మెజారిటీ (8,232) మినహా మిగతా ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థికి మెజారిటీ రాకపోవడంతో పార్టీ శ్రేణులతో చర్చిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క ఎమ్మెల్యే సీటు కూడా దక్కని బీజేపీకి లోక్‌సభ ఎన్నికల్లో భారీ మెజారిటీ రావడం కాంగ్రెస్‌కు ఊహించిన షాక్ తగిలింది. ఎవరూ ఊహించని తీరులో భారీ మెజారిటీ (1,72,897) రావడంతో కాంగ్రెస్ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎన్నికల ప్రచారానికి స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి హాజరై విస్తృత ప్రచారం నిర్వహించినా ఫలితం లేకపోవడంతో హస్తం శ్రేణుల్లో నిరాశని నింపింది. ఓటర్లు బీజేపీ వైపు మొగ్గు చూపడానికి గల కారణం ఏమిటనే ఆలోచనలో పడ్డారు. అసలు ఏం జరిగిందనే దానిపై క్షేత్రస్థాయిలో సమాచారం సేకరిస్తున్నారు. నాయకులు, కార్యకర్తలు కలిసి పనిచేశారా? లేకపోతే బీజేపీకి కోవర్టులుగా మారారా అన్న సమాచారం తీసుకుంటున్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా లెక్కలు తీస్తున్నారు. కాంగ్రెస్ బలంగా ఉన్న గ్రామాల్లో బీజేపీ గాలి వీయడానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు. ఐదున్నర నెలల కిందటే రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టిన కాంగ్రెస్ పార్టీకి కూడా ఈ ఎన్నికల్లో ఇబ్బందికర పరిస్థితులే ఎదురయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఆదరణ లోక్‌సభ ఎన్నికల్లో రాకపోవడంతో పార్టీ శ్రేణులు జరిగిన తప్పిదాలు, కారణాను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల వారీగా ఓట్లు ఎందుకు తగ్గాయనే విషయమై నాయకులు చర్చించుకుంటున్నారు.





పట్టణ ప్రాంతాల్లో బీజేపీకి ఎక్కువ లీడ్

బీజేపీకి ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఎక్కువగా లీడ్ ఇచ్చింది. మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి నియోజకవర్గాలు బీజేపీ అభ్యర్థి కొండాకు భారీ ఆధిక్యతను తెచ్చిపెట్టాయి. ఎన్నికల్లో అభ్యర్థిని గెలిపించేందుకు కొన్ని ప్రాంతాలకు కొంతమంది నేతలకు పార్టీ అదిష్ఠానం ఇన్‌చార్జి బాధ్యతలను కట్టబెట్టింది. ఇందులో భాగంగా మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్‌కు మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, బడంగ్‌పేట్‌కు మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, ఆర్కేపురానికి దేప భాస్కర్‌రెడ్డి, సరూర్‌నగర్ జీహెచ్‌ఎంసీకి సీనియర్ నాయకులు దయాకర్‌రెడ్డి, శంకర్ యాదవ్, మహేందర్‌రెడ్డి, మహేశ్వరానికి జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి ఇన్‌చార్జిలుగా వ్యవహరించారు. మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి నాయకత్వంలో గట్టిగా నాయకులు మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహించినా కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి కేవలం 99,175 ఓట్లు రావడం ఆశ్చర్యానికి గురి చేసింది. రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూడా ఇదే తరహాలోనే ఓట్ల వేటలో కాంగ్రెస్ వెనకబడింది. చేవెళ్ల అంటేనే కాంగ్రెస్‌కు కంచుకోట అని పేరు. ఇక్కడ గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి భీంభారత్ స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు. అయితే, ఇక్కడ కూడా బీజేపీకే లీడ్ వచ్చింది. కాంగ్రెస్ పార్టీ ఊహించిన రీతిలో ముందుకు వెళ్లలేక పోయింది. లోక్‌సభ ఎన్నికల్లో ఓటమిపై రాష్ట్రస్థాయిలో సమీక్షించడంతో పాటు ఏ నియోజకవర్గంలో ఎంత మేరకు తగ్గిందో ఓట్ల లెక్కలకు అనుగుణంగా కాంగ్రెస్ నేతలు సమీక్షిస్తున్నారు. ఎక్కడెక్కడ నేతలు పని చేశారు, ఎక్కడ చేయలేదన్న వివరాలను తీసుకోవడంతో పాటు రాష్ట్రస్థాయి సమావేశంలో చర్చించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ నేతలకు పదవీ గండాన్ని తెచ్చే అవాకశాలు ఉన్నాయన్న చర్చ జోరుగా సాగుతోంది. ఈ ఫలితాలు ఎవరి పదవులను ఊడగొడతాయో.. ఎవరికి పదవుల కాకుండా అడ్డుపడతాయోననే ఆందోళన ఆశావాహుల్లో వ్యక్తమవుతోంది. ఈ ఎన్నికల్లో పనితీరు, ఫలితాల ఆధారంగా మంత్రివర్గ విస్తరణతో పాటు నామినేటెడ్ పదవుల భర్తీ ఉంటుందని.. ఇప్పటికే ఆ పార్టీ అధిష్ఠానం రాష్ట్ర నేతలకు తేల్చి చెప్పింది. దీంతో తమ పదువులకు ఢోకా లేదని పలువురు నేతలు అప్పట్లో గంతులేశారు. కానీ.. ఓటింగ్ నాటికి పరిస్థితి పూర్తిగా మారిపోవడంతో ఇప్పుడు వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ఫలితంపై కొంత అసహనం వ్యక్తం చేసిన విషయం అందరికి తెలిసిందే.

ప్రధాన పార్టీలకు అసెబ్లీ నియోజకవర్గాల వారీగా వచ్చిన ఓట్లు

నియోజకవర్గం	బీఆర్ఎస్	బీజేపీ	కాంగ్రెస్	ఆధిక్యం (పార్టీ)
మహేశ్వరం	37,215	1,49,527	99,175	50,352 (బీజేపీ)
రాజేంద్రనగర్	28,529	1,57,701	1,38,495	19,206 (బీజేపీ)
శేరిలింగంపల్లి	42,687	1,78,249	1,04,472	73,777 (బీజేపీ)
చేవెళ్ల	21,410	93,778	71,678	22,100 (బీజేపీ)
పరిగి	23,142	74,024	71,816	2,208 (బీజేపీ)
వికారాబాద్	13,959	67,584	75,361	8,232 (కాంగ్రెస్)
తాండూరు	10,598	77,654	69,864	7,790 (బీజేపీ)
ఈవీఎం ఓట్లు	1,77,540	7,98,517	6,30,861	1,67,656 (బీజేపీ)
పోస్టల్ బ్యాలెట్స్	1,428	11,365	6,124	5,241 (బీజేపీ)
మొత్తం ఓట్లు	1,78,968	8,09,882	6,36,985	1,72,897 (బీజేపీ)

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

- మున్సిపల్ కమిషనర్ల సమావేశంలో కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం సీజన్ ప్రారంభం కావడంతో జాగ్రత్తగా ఉండాలని కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలంలో సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా ప్రణాళికలను సిద్ధం చేయాలని తెలిపారు. ఎమర్జెన్సీ బృందాలను అప్రమత్తం చేసి వరద నివారణకు చర్యలు చేపట్టాలని, మ్యాన్‌హోల్స్, నాలాల పూడికతీత పనులు, ఎమర్జెన్సీ బృందాల గురించి కమిషనర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీలు క్లీన్‌చేయాలని, డిజాస్టర్ టీమ్‌లను రెడీగా ఉంచాలని, వారికి అవసరమైన సామగ్రిని అందుబాటులో ఉండే విధంగా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. డ్రైనేజీ మూతలను ఓపెన్ చేయకూడదన్నారు. ఎక్కడైనా మ్యాన్ హోల్‌లు, నాలాలు ఓపెన్‌గా ఉన్న చోట డేంజర్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి జీహెచ్‌ఎంసీకి అనుసంధానంగా కనెక్షన్ ఇవ్వాలన్నారు. చెరువులు ఉన్న చోట ఎఫ్‌టీఎల్, బౌండరీ ఏర్పాటు చేసి, పిల్లర్లు కట్టి పేయింట్ వేయాలన్నారు. ప్రతి రోజు మున్సిపల్ కమిషర్లులు తనిఖీలు చేపట్టాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్యా, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

ఘట్‌కేసర్‌లో భారీ వర్షం

- ఉరుములతో భయకంపితులైన జనాలు
- వాహనదారుల ఇబ్బందులు

ఘట్‌కేసర్/ఘట్‌కేసర్ రూరల్, జూన్ 10 : ఘట్‌కేసర్ మండలంలో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. అవుషాపూర్, అంకుశాపూర్, ఎదులాబాద్, మర్రిపల్లి గూడ, మాదారం, కొర్రెముల, ఘనాపూర్ తదితర గ్రామాల్లో వర్షం పడింది. భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. డ్రైనేజీలు పొంగిపొర్లాయి. వాహనాదారులు వర్షానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు, ఉరుములు, మెరుపులతో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. పొలాలు, కుంటలు, కాలువలు, చెరువుల్లోకి వరదనీరు వచ్చి చేరింది. బాంబుల మోతల మాదిరిగా భారీ ఉరుమలతో జనాలు భయందోళలకు గురుయ్యారు.




భారీ వర్షంతో వ్యవసాయ పొలాల్లో చేరిన వర్షపు నీరు

అవిశ్వాసానికి అడ్డు?

- ముందుకు సాగని మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం
- కాంగ్రెస్ పెద్దల మధ్య కుదరని ఏకాభిప్రాయం
- పీసీసీ ఉపాధ్యక్షుడిపై కౌన్సిలర్ల గుర్రు
- చైర్‌పర్సన్ భర్త నర్సింహారెడ్డి సుధీర్‌రెడ్డిని కలవడంపై అనుమానాలు

ఆంధ్రజ్యోతి, మేడ్చల్/మేడ్చల్‌టౌన్. జూన్ 9 : మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికా నర్సింహారెడ్డిపై కొనసాగుతున్న అవిశ్వాస తీర్మాన వ్యవహారం రోజుకో కొత్త మలుపు తిరుగుతోంది. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీ పెద్దల మధ్య ఏకాభిప్రాయం కుదరక అవిశ్వాసాన్ని దాటవేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. 23మంది కౌన్సిలర్లలో ముగ్గురు కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు ఉండగా.. పార్లమెంట్ ఎన్నికలకు ముందు మరో 13 మంది బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో కాంగ్రెస్ పార్టీ తరఫున అవిశ్వాసం కోసం మెజారిటీ కౌన్సిలర్ల బలం చేకూరింది. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాలని కోరుతూ మే 18న కాంగ్రెస్‌కు చెందిన 16 మంది కౌన్సిలర్లు కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా నోటీసు ఇచ్చారు. అయినా అవిశ్వాసం వాయిదా పడుతుండడంతో స్థానిక పార్టీ పెద్దలే ఈ వ్యవహారానికి అడ్డుతగులుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



పార్టీ మారిందే అవిశ్వాసం కోసం..

అవిశ్వాసం వ్యవహారం ఎటూ తేలక పోవటంతో ఇటీవ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లు కాంగ్రెస్ పెద్దల తీరు పట్ల గుర్రుమంటున్నారు. పార్టీలో చేరేముందు మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి, పీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్ యాదవ్‌తో పూర్తిస్థాయిలో సంప్రదింపులు జరిపి, అవిశ్వాసం కోసం మాటిచ్చిన అనంతరం పార్టీలో చేరామని కొందరు కౌన్సిలర్లు ఖరాకండిగా చెబుతున్నారు. అయితే, ఎన్నికలకు ముందు పార్టీలో చేర్చుకుని.. ఎన్నికల అనంతరం తమ గురించి పట్టించుకోవటం లేదని కొందరు నేతలు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. పార్టీ పెద్దల సూచనల మేరకే మే 18న కలెక్టర్‌కు అవిశ్వాసం కోసం 16 మంది కౌన్సిలర్లు నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ విషయం గురించి పార్టీ పెద్దలను అడిగినా స్పందించకపోవటంతో కొందరు బడా నాయకులు చైర్‌పర్సన్ పదవిని రక్షించేందుకు యత్నిస్తున్నట్లు పలువురు కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు.

ద్వారాలు తెరిచిన బీజేపీ

కాంగ్రెస్ పార్టీ పెద్దలు అవిశ్వాసం వ్యవహారాన్ని దాటవేస్తుండటంతో బీజేపీ పెద్దలు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు తమ పార్టీలో ముకుమ్మడిగా చేరితే అవిశ్వాసానికి పూర్తి సహకారం అందిస్తామంటూ భరోసా ఇస్తున్నట్లు సమాచారం. తమ పార్టీలోకి కనీసం 15 మంది కౌన్సిలర్లు వచ్చిన వెంటనే అవిశ్వాస ప్రక్రియ ప్రారంభమయ్యేలా అధికారులపై ఒత్తిడి తీసుకొస్తామని బీజేపీ నాయకులు కాంగ్రెస్ కౌన్సిలర్లతో సంప్రదింపులు జరుపుతున్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే, తాము ఇచ్చిన అవిశ్వాసంపై 30 రోజుల్లోపు స్పందించని ఎడల సమావేశమై సరైన నిర్ణయం తీసుకుంటామని కాంగ్రెస్ కౌన్సిలర్లు బీజేపీ నేతలకు చెప్పినట్లు సమాచారం, కాగా, చైర్‌పర్సన్‌ను గద్దె దింపటమే లక్ష్యంగా పెట్టుకున్న నేతలు ఎంతవరకు సఫలమవుతారో వేచి చూడాల్సిందే.

సుధీర్‌రెడ్డి తీరుపై మండిపడుతున్న కౌన్సిలర్లు

కాగా, అవిశ్వాసానికి మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అడ్డుపడుతున్నట్లు ప్రచారం సాగుతోంది. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, చైర్‌పర్సన్ దీపిక భర్త నర్సింహారెడ్డిలు గతంలో తెలుగుదేశం పార్టీలో కలిసి పనిచేశారు. దాంతో సుధీర్ రెడ్డి మేడ్చల్ చైర్‌పర్సన్‌ను కాపాడుతున్నట్లు కొందరు ఆరోపిస్తున్నారు. అదే విధంగా పార్ల మెంట్ ఎన్నికలకు ముందు చైర్‌పర్సన్ భర్త నర్సింహారెడ్డి ఇద్దరు కౌన్సిలర్లతో కలిసి కాంగ్రెస్‌లో చేరటానికి సుధీర్‌రెడ్డితో కలవటం స్థానిక కౌన్సిలర్ల అనుమానాలకు మరింత బలం చేకూర్చింది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి కోసం పనిచేసిన చైర్‌పర్సన్‌ను తమ పార్టీ పెద్దలు రక్షించటం కౌన్సిలర్లకు మింగుడు పడటం లేదు.



ఒక్కటైన సామాజిక వర్గం!

మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపిక.. రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతోనే ఆమె పదవిని రక్షించటానికి కాంగ్రెస్‌లోని రెడ్డి సామాజిక వర్గానికి చెందిన కొందరు బడా నాయకులు యత్నిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఈ కారణంగానే ఆమెపై అవిశ్వాస తీర్మాణానికి ఒప్పుకోవటం లేదని కొందరు నేతల అభిప్రాయం. అవిశ్వాసం ప్రక్రియను నిలిపి వేయటానికి సీఎం పేషీ నుంచి కలెక్టర్‌పై ఒత్తిడి తెస్తున్నారని సమాచారం. అవిశ్వాసం కోసం ఫిర్యాదు చేసి 20 రోజులు గడుస్తున్నప్పటికీ కలెక్టర్ నోటీసు జారీ చేయకపోగా.. కౌన్సిలర్లు కలవటానికి సమయం ఇవ్వకపోవటంతో విస్మయం చెందుతున్నారు. ఈ విషయంలో పూర్తి భరోసా ఇచ్చిన నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్ తన రాజకీయ గురువు, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వ్యతిరేకంగా మాట్లాడలేక చేతులెత్తేస్తున్నారని పలువురు కౌన్సిలర్లు బాహాటంగానే చెబుతున్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, జూన్ 10 : శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న వివిధ పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం ప్రజావాణిలో భాగంగా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌తో కలిసి ప్రజల నుంచి 96 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. వివిధ శాఖల్లో జరుగుతున్న పనులను అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పనులు పూర్తి అయ్యేలా చూడాలన్నారు. ఈ నెల 12 నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని తెలిపారు. పాఠశాలల్లో మరమ్మతుల నిమిత్తం రూ. 50 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులందరూ అటెండెన్స్ యాప్‌లో తమ హాజరును తప్పని సరిగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఎరువులు, విత్తనాలు రైతులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలలు తీసుకోవాలని తెలిపారు. వానాకాలం సీజన్‌లో ఎలాంటి పంటలు వేసుకోవాలి అని దానిపై ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో మిల్లర్లకు నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా సీఎంఆర్(మిల్లు పట్టిన బియ్యం) వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. మిల్లర్ల సామర్థ్యాన్ని బట్టి సీఎంఆర్ వచ్చే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి ప్రజా సమస్యలు తీర్చేందుకు కృషి చేయాలని తెలిపారు.



ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

జిల్లా అధికారులు తప్పని సరిగా హాజరు కావాలి

ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి జిల్లా అధికారులుందరూ తప్పని సరిగా హాజరు కావాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడం లేదా అత్యవసరమైన పనులు ఉన్నట్లయితే కలెక్టర్‌కు సమాచారమిచ్చి అనుమతి తీసుకోవాలని తెలిపారు. సమాచారం లేకుండా ప్రజావాణికి గైర్హాజరు అయిన అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం జరుగుతుందన్నారు.

మూడు రోజుల్లో పరిష్కరించాలి: కలెక్టర్ గౌతమ్

మేడ్చల్(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను మూడు రోజుల్లో తప్పనిసరిగా పరిష్కరించాలని కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులను ఆయన స్వీకరించి మాట్లాడారు. ఆయా శాఖల అధికారులు ప్రజావాణిలో పరిష్కరించిన ఫిర్యాదులను వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతీ అధికారి తప్పనిసరిగా లాగిన్ కావాలన్నారు. జఠిలమైన సమస్యను మూడు రోజుల్లో పరిష్కరించాలన్నారు. కాగా సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 90 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి తదితరులుపాల్గొన్నారు.

దోర్నాల్ అడవిలో చెట్ల నరికివేత

- చదును చేసి విత్తనాలు వేసేందుకు యత్నం
- పట్టించుకోని అటవీశాఖ అధికారులు



దోర్నాల్ అటవీ ప్రాంతంలో నరికిన చెట్లు

ధారూరు, జూన్ 10: ధారూరు అటవీ రేంజ్ పరిధిలోని దోర్నాల్ అటవీ బీట్‌లో అక్రమార్కులు విలువైన చెట్లను నరికివేశారు. శని, ఆదివారాలు సెలవులు కావటంతో అటవీ ప్రాంతంలోని చెట్లను రాత్రింబవళ్లు నరికి చదునుచేశారు. వర్షాలు పడితే దున్ని విత్తనంవేసి అటవీ భూమిని అక్రమించుకోవాలని ప్రయత్నిస్తున్నారు. గత వేసవిలో సంగాయిపల్లి అటవీ ప్రాంతంలో ఎకరాల కొద్దీ అటవీ భూమిలోని చెట్లను నరికినా అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవటంతో అడివి నరికివేత కొనసాతూనే ఉంది. దోర్నాల్ అటవీ బీట్‌లో రెండు రోజుల నుంచి సమీప గ్రామాల వారు అడవిలోని పెద్ద,పెద్ద చెట్లను నరికివేశారు. చెట్ల పొదలను తొలగించారు. చదును చేసిన అటవీ భూమిలో వానాకాలంలో పంటలు సాగుచేసి అటవీ భూమిని ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. కాగా సోమవారం ఇన్‌చార్జి ఫారెస్ట్ రేంజర్ అరుణ చెట్లను నరికివేసిన అటవీ ప్రాంతాన్ని పరిశీలించి వెళ్లారు. అడవిలో చెట్లు నరికిన వారిని గుర్తించి చర్యలు తీసుకునేందుకు అధికారులు వెనుకంజ వేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అక్రమార్కులతో అటవీ అధికారులు కుమ్మక్కవడం వల్లే దర్జాగా అడవి ఆక్రమనకు గురవుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంగాయిపల్లి అడవిలో చెట్ల నరికివేతపై ఫ్లయింగ్‌స్క్వాడ్ డీఎఫ్‌వో, విజిలెన్స్ డీఎఫ్‌వో విచారణ జరిపినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం గమనార్హం.

వంద శాతం మొక్కలు నాటాలి

కులకచర్ల, జూన్ 10: వర్షాలు మొదలవగానే గ్రామాల్లో వంద శాతం మొక్కలు నాటాలని ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. మండలంలోని అంతారం గ్రామంలో మొక్కలు నాటేందుకు రోడ్డు పక్కన తీస్తున్న గుంతలను ఆయన పరిశీలించారు. అమ్మ ఆదర్శ పథకంలో భాగంగా పాఠశాలల్లో జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

బంగారు దుకాణం యజమాని మాయం!

- రూ.లక్షల్లో కుచ్చుటోపి పెట్టి ఉడాయించిన వ్యాపారి
- బాధితుల ఆందోళన.. పోలీసులకు ఫిర్యాదు


ధారూరులో తాళాలు వేసి ఉన్న బంగారు దుకాణం

ధారూరు, జూన్ 10: ధారూరులోని ఓ బంగారం దుకాణం యజమాని అద్దె ఇంటికి, దుకాణానికి తాళం వేసి మాయమయ్యాడు. చాలాకాలంగా బంగారం దుకాణం నడుపుతున్న యజమాని అందరిని నమ్మించి బంగారం తనఖాలు పెట్టుకుని, బంగారం నగల కోసం అడ్వాన్సు డబ్బులు తీసుకుని, వ్యాపారం కోసం అప్పులు చేసి ఉడాయించటంతో సోమవారం బాధితులు ఆందోళనకు దిగారు. మోసపోయిన బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. గుజరాత్ రాష్ట్రానికి చెందిన దీపక్ వైష్ణవ్ ధారూరులో చాలా కాలంగా బంగారు దుకాణం నడిపిస్తూ పాన్ బ్రోకర్‌గా వ్యాపారం చేస్తున్నాడు. కాగా దీపక్ వ్యాపారంపై నమ్మకం కుదిరిన వారు బంగారం తనఖా పెట్టి డబ్బులు అప్పులు తీసుకున్నారు. కొంతమంది బంగారు నగల కోసం డబ్బులు అడ్వాన్సుగా చెల్లించారు. మరి కొంతమంది వ్యాపారం కోసం రూ.లక్షలు అప్పుగా ఇచ్చారు. దీపక్ వారం రోజులు క్రితం తిరుపతికి వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగిరాకపోగా, ఫోన్ స్విచ్ఛాప్ చేసుకున్నాడు. వారం రోజులుగా బంగారు దుకాణానికి తిరుగుతున్న వినియోగదారులకు దుకాణం తాళం వేసి ఉండటంతో ఆందోళనకు గురయ్యారు. ఫోన్ చేస్తే స్విచ్ఛాప్ వస్తుంది. దీంతో బాధితులు సోమవారం దీపక్ దుకాణం ముందు ఆందోళనకు దిగారు. ఎదురుగా ఉన్న బంగారు దుకాణానికి వెళ్లి యజమానితో బాధితులు వాదనకు దిగారు. దీపక్ ఎక్కడికి వెళ్లాడో, ఎక్కడ ఉన్నాడో చెప్పాలని, దీపక్ అడ్రస్ నీకే తెలుసంటూ ఆయనను నిలదీశారు. కాగా దీపక్ తన వద్ద రూ.11.80లక్షలు అప్పుతో పాటు బంగారు కోసం రూ.3లక్షలు నగదు ఇచ్చానని, అప్పు తీసుకున్న డబ్బులు, బంగారం డబ్బులు ఇంతవరకు ఇవ్వలేదని, అద్దె ఇంటికి, బంగారు దుకాణానికి వెళ్లగా తాళాలు వేసి ఉందని, మండల పరిధిలోని రాంపూర్ తండాకు చెందిన రవినాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాగసమందర్ గ్రామానికి చెందిన అగ్గనూరి వీరేశం బంగారం కోసం రూ. 10 లక్షలు నగదు ఇచ్చానని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంగారం కోసం అడ్వాన్సుగా రూ. 2.30 లక్షలు దీపక్‌కు ఇచ్చానని ధారూరుకు చెందిన చాకలి పాండు చెప్పారు. కాగా తనఖా పెట్టిన బంగారం, బంగారానికి నగదు తీసుకున్న డబ్బుల విలువ రూ. లక్షల్లో ఉంటుందని బాధితులు తెలిపారు. బంగారం తనఖా పెట్టి అప్పులు తీసుకున్న వారు, అప్పులు చెల్లించిన వారి బంగారం వాపస్ ఇవ్వలేదని, తమను మోసం చేసి ఉడాయించిన బంగారం వ్యాపారి దీపక్ వైష్ణవ్ పై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో కోరారు.


ఎదురుగా ఉన్న బంగారు దుకాణం యజమానిని నిలదీస్తున్న బాధితులు


విలేకరులతో మాట్లాడుతున్న హరిప్రసాద్, నర్సింహ, శ్రీను

ప్రవీణ్‌కుమార్‌కు అసంబద్ధ ఆరోపణలు తగదు

ఆమనగల్లు, జూన్ 10: గోవిందాయిపల్లికి చెందిన గుండెమోని శివగౌడ్, శేషగారి శివగౌడ్‌ల హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు కండె హరిప్రసాద్, బీజేపీ కల్వకుర్తి నియోజకవర్గ కోకన్వీనర్ గోరటి నర్సింహ, మండల ప్రధాన కార్యదర్శి శ్రీను కోరారు. హత్యా రాజకీయాలను పార్టీ ఉపేక్షించదన్నారు. ఆమనగల్లులో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ కడ్తాల బటర్ ఫ్లై సిటీలో గల ఓ ఇంట్లో జరిగిన ఇద్దరి హత్యలపై విచారణ జరిపించి నిందితులను శిక్షించాలన్నారు. హత్యలు చేసిన జల్కం రవికి, బీజేపీ నేత ఆచారితో సంబంధాలున్నాయని, హత్య వెనుక బీజేపీ నేతల పాత్ర ఉందా? అనే కోణంలో పోలీసు విచారణ జరపాలని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నిరాధార, అసంబద్ధ ఆరోపణలు చేయడం తగదన్నారు. 40ఏళ్లుగా ఆచారి ప్రజా సమస్యలపై పనిచేస్తున్నారని గుర్తు చేశారు. యువకుల హత్య వెనుక ఎవరి ప్రమేయం ఉన్నా వారికి శిక్ష పడాల్సిందేనన్నారు. సమావేశంలో నాయకులు నాజర్, మహేష్‌గౌడ్‌లు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

ఆమనగల్లు, జూన్ 10: ఆమనగల్లుకు చెందిన శృతిలయ కల్చరల్ అకాడమీ విద్యార్థులు సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతీలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్‌లో 10జీపీఏ సాధించిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై 230మంది విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా శృతిలయ అకాడమీకి చెందిన 120మంది విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు ప్రదర్శించారు. అకాడమీ విద్యార్థులను సీఎం అభినందించారు. కార్యక్రమంలో కల్చరల్ అకాడమీ చైర్మన్ చిత్తరంజన్‌దాస్, ప్రధానకార్యదర్శి విజయ్‌కుమార్, సభ్యులు అభినవ్‌రెడ్డి, ధనలక్ష్మి, వసంత, శ్రీశైలం, గోపి పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు మెరుగైన వసతులు కల్పించాం


హజ్ యాత్రికులకు సెండాఫ్ చెబుతున్న హజ్ కమిటీ చైర్మన్ పాషా

శంషాబాద్ రూరల్, జూన్ 10 : హజ్ యాత్రికులకు మెరుగైన వసతులు కల్పించామని తెలంగాణ హజ్ కమిటీ చైర్మన్ కుస్రో పాషా అన్నారు. సోమవారం శంషాబాద్ విమానాశ్రయంలో హజ్ యాత్రికులకు ఆయన సెండాఫ్ చెప్పారు. అనంతరం మాట్లాడుతూ... రుమోసియా టూర్స్ అండ్ ట్రావెల్స్ అధ్వర్యంలో కడప నుంచి 50మంది యాత్రికులు బయలుదేరి వెళ్లారన్నారు. యాత్రికులకు భోజన, గృహ వసతి కల్పించామని తెలిపారు. ఈ యాత్ర నెల రోజులు ఉంటుందని చెప్పారు. యాత్రీకులు పర్యాటక కేంద్రాలను సందర్శిస్తారని చెప్పారు.

ప్లే గ్రౌండ్ ప్రభుత్వ స్థలమే

- మరోసారి తేల్చిన రెవెన్యూ అధికారులు
- ఈ స్థలంలోకి వస్తే క్రిమినల్ కేసులే : ఆర్డీవో
- ఎమ్మెల్యే, ఆర్డీవోకు అభినందనల వెల్లువ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాండూరు, జూన్ 10: తాండూరు పట్టణం విజయ విద్యాలయ పక్కన గల ప్లేగ్రౌండ్‌గా వాడుతున్న స్థలం ప్రభుత్వ స్థలమేనంటూ రెవెన్యూ అధికారులు మరోసారి తేల్చారు. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతంపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్‌రావు స్పందించారు. తహసీల్దార్ తారాసింగ్, డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, ఆర్ఐ బాల్‌రాజ్, సర్వేయర్ శ్రీహరి, సర్వే నంబర్ 111లో గల విజయ విద్యాలయ ప్లే గ్రౌండ్ స్థలాన్ని సోమవారం సర్వేచేశారు. ఎట్టకేలకు ఇది ప్రభుత్వ భూమేనని మరోసారి రెవెన్యూ అధికారులు తేల్చారు. 111 సర్వే నంబర్‌లో 14 ఎకరాల్లో ప్లేగ్రౌండ్ ఖాళీస్థలం 16గుంటలు కూడా ప్రభుత్వానిదేనని రెవెన్యూ అధికారులు తేల్చారు. ఈ స్థలం అన్యాక్రాంతం కాకుండా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్ రావు చొరవ చూపడంతో పలువురు స్థానికులు అభినందించారు. ఈ స్థలంలో రెవెన్యూ స్థలం బోర్డును మంగళవారం ఏర్పాటు చేస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు. కొందరు వ్యక్తులు తమ స్థలమంటూ పాతిన బోర్డును తొలగిస్తామని తెలిపారు.


విజయ విద్యాలయ హైస్కూల్ పక్కన ఖాళీస్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు



ఇది మా పెద్దల ఆస్తి

ఇది మా పెద్దల ఆస్తి. 1945 నుంచి మా తాత పట్టాదారుడని పసారం శశాంక్, బస్వరాజ్ పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు మా వాదనలు వినడం లేదు. విజయ విద్యాలయ స్థలం మాదే. మాకూ కోర్టు నుంచి ఆర్డర్ ఉంది. గతంలో విజయ విద్యాలయ హైస్కూల్ ఏర్పాటు చేసేందుకు స్థలం ఇచ్చాం. ఖాళీగా ఉన్న స్థలం మాదే.

- పసారం బస్వరాజ్, శశాంక్

ఈస్థలంలోకి వస్తే క్రిమినల్ చర్యలు : ఆర్డీవో

విజయ విద్యాలయ హైస్కూల్ పక్కన ఖాళీ స్థలం 16గుంటలు ప్రభుత్వ స్థలమే. ఈ స్థలంలో ఎవరైనా తమదేనని జోక్యం చేసుకుంటే క్రిమినల్ కేసులు పెడుతాం. ఈ స్థలంపై రెవెన్యూ బృందంతో సోమవారం సర్వేచేయించామని పాత రికార్డులనూ పరిశీలించి ప్రభుత్వ స్థలమేనని నిర్ధారించాం. ఈ స్థలం అన్యాక్రాంతం కాకుండా రక్షిస్తామని తెలిపారు.


డీజీపీకి ఫిర్యాదు చేసి మాట్లాడుతున్న దళితులు

పరిగి డీఎస్పీపై డీజీపీకి ఫిర్యాదు

పరిగి, జూన్ 10: దళితులపై దాడులు చేసి, కులం పేరుతో దూషించిన వారిని వెంటనే అరెస్ట్ చేయడంలో పరిగి డీఎస్పీ నిర్లక్ష్యం చేస్తున్నారని పరిగి మండలం రుకుంపల్లి గ్రామ దళితులు ఆరోపించారు. నగరంలోని డీజీపీని సోమవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం దళిత సంఘం నాయకులు మొగులయ్య, మాణిక్యం, వెంకటయ్య, చంద్రయ్య, శ్రీనివాస్‌లు మాట్లాడారు. గతనెల ఏప్రిల్ 28న గ్రామంలో పోచమ్మ బోనాల గుడి దగ్గర దళితులకు చెందిన సౌండ్ బాక్స్‌లు అద్దెకు పెట్టినట్లు తెలిపారు. బోనాల ఉత్సవం పూర్తి కాగానే సాయంత్రం సౌండ్‌బాక్స్‌లు తీసుకురావడానికి వెళ్లిన మొగులయ్య, తదితరులను గ్రామానికి చెందిన హన్మంత్, సురేష్, కృష్ణలు కలిసి కులం పేరుతో దూషించారని, దళితబంధు కింద ఇప్పించాం కదా ఉచితంగా పెట్టాలని డిమాండ్ చేసి గొడవ పడ్డారని తెలిపారు. అదే రోజు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్ట్ చేయించడంలో నిర్లక్ష్యం చేస్తున్న పరిగి డీఎస్పీపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.


ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి గోడు వెల్లబోసుకుంటున్న గిరిజనులు

ఆక్రమణ నుంచి భూమి కాపాడాలని ఎమ్మెల్యేకు మొర

యాచారం, జూన్ 10: మంతన్‌గౌరెల్లిలో సర్వే నంబర్ 71, 72లలోని 4ఎకరాల 16గుంటల భూమిని బిల్ల అనే వ్యక్తి ఆక్రమించి దాడులు చేస్తున్నాడని సోమవారం మండల పరిధి మంతన్‌గౌరెల్లికి చెందిన బిక్కు,జ్యోతి దంపతులు నగరంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని ఆయన నివాసంలో కలిసి గోడు వెల్లబోసుకున్నారు. తమకు జరిగిన అన్యాయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా వారిని అరెస్టు చేయలేదన్నారు. పోలీస్‌స్టేషన్ వద్ద ఆత్మహత్యాయత్నం చేసినా పట్టించుకోవడం లేదని విలపించారు. న్యాయం చేస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వి.తిరుమలేష్, గోపాల్, మోహన్, గోపి, కోట, సోమ్లా, ఎం.నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా ఏమైంది?

- సాగుకు పనికి రాని 'భరోసా' ఎందుకు? : సబితారెడ్డి

కందుకూరు, జూన్ 10 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తానన్న రైతు భరోసా ఏమైందని, అదునుదాటిన తరువాత రైతులకు పనికిరాని భరోసా ఇచ్చినా ప్రయోజనం ఏమిటని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సోమవారం కందుకూరులో బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల మాజీ సీఎం కేసీఆర్ రైతులకు, రైతు కూలీలకు, ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చారన్నారు. తాము ప్రభుత్వంలోకి వస్తే రైతులకు ఎకరానికి ఏడాదికి రూ.15వేల చొప్పున ఇస్తామని అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. అమల్లో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం తప్ప ఆరు గ్యారెంటీలేవీ అమలుచేయడం లేదన్నారు. ఈ విషయంపై రైతులు, రైతు కూలీలు, ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. వెంటనే రైతు భరోసాను ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ డి.చంద్రశేఖర్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు ఎస్.శేఖర్‌రెడ్డి, అనంద్, నాయకులు మన్నె జయేందర్, దశరథ్, సుదర్శన్ రెడ్డి, తాళ్ల కార్తీక్, హన్మంతరెడ్డి, వెంకటేష్, రాజేందర్‌రెడ్డి, నుగుణాకర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

ప్రమాదకరంగా చెరువుకట్ట

బషీరాబాద్, జూన్ 9: దామర్‌చెడ్-వాల్యానాయక్ తండాకు వెళ్లే మార్గంలో చెరువు కట్టపై నిర్మించిన తారు రోడ్డు పలుచోట్ల ధ్వంసమైంది. ఈ ప్రాంతంలో కొంతదూరం సీసీ రోడ్డును కూడా నిర్మించగా ఎగుడుదిగుడుగా కుంగిపోయి ప్రమాదకరంగా తయారైంది. దీంతో బైక్ పై వెళ్లేవారు ఎక్కడ ప్రమాదం సంభవిస్తుందోనని భయంభయంగా రాకపోకలు సాగిస్తున్నారు. చెరువు కట్టపై పలుచోట్ల తారు రోడ్డు ధ్వంసమై గుంతలుగా మారడంతో వాహనదారులు పలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుపై రాత్రి వేళల్లో వాహనాలపై వెళ్లాలంటే గిరిజన ప్రజలు మరింత జంకుతున్నారు. సంబంధిత అధికారులు ఈ రోడ్డు మరమ్మతుకు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


ఊరచెరువు కట్టపై రోడ్డు ఇలా

56 కేజీల గంజాయి పట్టివేత

వికారాబాద్, జూన్ 10: భారీగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని అతని వద్ద గంజాయి స్వాధీనం చేసుకున్న సంఘటన వికారాబాద్ జిల్లా కేంద్రంలో రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. విశాఖపట్నం నుంచి ముంబాయి వెళుతున్న ఎల్‌టీటీ రైలులో సాయంత్రం పలాసాకు చెందిన ఓ వ్యక్తి 56 కేజీల గంజాయితో వికారాబాద్ స్టేషన్‌లో దిగాడు. రైలు గంట ఆలస్యంగా రావడం అదే సమయంలో రైల్వే పోలీసులు తనిఖీలు చేయగా అతని వద్ద భారీ మొత్తంలో గంజాయిని గుర్తించారు. ఆ సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ఇందుకు సంబంధించి బుధవారం పోలీసులు పూర్తి వివరాలు వెల్లడించే అవకాశం ఉంది. అయితే ఈ మధ్య కాలంలో కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌తో పాటు ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి భారీగా తరలిస్తున్నారు. అయితే వికారాబాద్ జంక్షన్ కావడంతో ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు రైలు సౌకర్యం ఉండడంతో వికారాబాద్ కేంద్రంగా గంజాయి అక్రమ రవాణా కొనసాగిస్తున్నట్లుగా తెలుస్తోంది.


మూడుచింతలపల్లి మండలంలో విత్తనాల దుకాణాలను అకస్మికంగా తనిఖీ ఏస్తున్న ఏడీఏ వెంకట్రాంరెడ్డి

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

- మేడ్చల్ జిల్లా ఏడీఏ వెంకట్రాంరెడ్డి

మూడుచింతలపల్లి, జూన్ 10: రైతులకు నకిలీ విత్తనాలు, గడువు దాటిన విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్ అధికారి మేడ్చల్ ఏడీఏ వెంకట్రాంరెడ్డి హెచ్చరించారు. మండల కేంద్రంలోని విత్తనాల దుకాణాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. డీలర్లు రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించి వెంటనే బిల్లులు ఇవ్వాలని దుకాణదారులకు సూచించారు. రైతులు పంటకాలం పూర్తయ్యే వరకు బిల్లులు, విత్తనాల సంచిని భద్రపరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ యాదగిరి, సీడ్ సర్టిఫికేషన్ అధికారి మహేష్, మండల వ్యవసాయాధికారి కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

నాటుడు.. నరుకుడు!

- ఇదేం పనని మండిపడుతున్న ప్రజలు
- చోద్యం చూస్తున్న అటవీ శాఖ అధికారులు

చేవెళ్ల, జూన్ 10 : పచ్చని చెట్లు-ప్రగతి మెట్లు అని ప్రభుత్వం వేల కోట్లు వెచ్చించి ఏటా రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి పెంచుతోంది. అయితే విద్యుత్ వైర్లకు వైర్లు తాకుతున్నాయని విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా పెద్దపెద్ద చెట్లను నరికేస్తున్నారు. చేవెళ్ల మండలం కమ్మెట చౌరస్తా నుంచి చిలుకూరు రోడ్డులో రెండేళ్లుగా మొక్కలు పెంచుతున్నారు. ఈ చెట్లు వాహనదారులకు, బాటసారులకు నీడనిస్తున్నాయి. చెట్ల కొమ్మలు విద్యుత్ వైర్లకు తగులుతున్నాయని రెండు రోజులుగా విద్యుత్ అధికారులు ఎక్స్‌కవేటర్లతో చెట్లను తొలగిస్తున్నారు. ఇది చూస్తూ ప్రజలు, వాహనదారులు విద్యుత్ శాఖ తీరుపై మండిపడుతున్నారు. రోడ్ల పక్కన, వైర్ల కింద మొక్కలు నాటడం ఎందుకు? మళ్లా నరికేయడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. మొక్కలు వృక్షాలైన సమయంలో కొట్టేస్తే మరి నాటడం ఎందుకంటున్నారు. విద్యుత్ స్తంభాలు లేని చోటే నాటాలన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చెట్లను తొలగించకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఇదిలా ఉంటే చెట్ల నరికివేతపై అటవీ శాఖ అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. రైతులు తమ అవసరాలకు పొలాల్లోని చెట్లు నరికితే ఆక్షేపించే అధికారులు ఇప్పుడెందుకు పట్టించుకోవడంలేదో తెలియడం లేదు.


కమ్మెట రోడ్డు పక్కన నరికిన చెట్లు

ఉన్నతాధికారులు స్పందించాలి



ప్రభుత్వం నాటించిన మొక్కలు పెరిగాక నరికివేయడం బాధాకరం. విద్యుత్ స్తంభాలు చిన్నగా ఉండటం వల్లే కొమ్మలు వైర్లకు తగులుతున్నాయి. రోడ్డు వెంట పొడవైన విద్యుత్ స్తంభాలు పాతితే కొన్నేళ్ల వరకు చెట్ల నరికివేత ఉండదు. ఉన్నతాధికారులు స్పందించి చెట్లు నరివేతను ఆపేయించాలి. చెట్లను పరిరక్షించాల్సిన యంత్రాంగం స్పందించకపోవడం సరికాదు. చెట్లు ఉంటేనే ప్రజలకు, పర్యావరణానికి మేలు.

- హన్మంతరెడ్డి, మాజీ సర్పంచ్, కమ్మెట

బస్సు కోసం ఆరు గంటలు నిరీక్షణ

- రోడ్డుపైకి వచ్చి మహిళా ప్రయాణికుల నిరసన
- రంగంలోకి పోలీసులు

తాండూరు, జూన్ 10: తాండూరు నుంచి మహబూబ్ నగర్‌కు ప్రతీ ఆరగంటకు ఒకసారి తాండూరు డిపో నుంచి వెళ్లే ఆర్టీసీ బస్సులు సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 6 గంటల వరకూ రాకపోవడంతో మహిళా ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. బస్టాండ్ నుంచి రోడ్డుపైకి వచ్చి నిరసన తెలిపారు. సుమారు అరగంట పాటు ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని మహిళలను సముదాయించి బస్టాండ్‌లోకి తీసుకొచ్చారు. అనంతరం ఎట్టకేలకు ఆర్టీసీ అధికారులు మహబూబ్‌నగర్‌కు ఒకే బస్సు ఏర్పాటు చేయడంతో బస్సులో ఎక్కేందుకు మహిళల మధ్య తోపులాట జరిగింది. పోలీసులు అక్కడ మహిళలను దగ్గరుండి బస్సులోకి ఎక్కించారు.


నిరసన వ్యక్తం చేస్తున్న మహిళా ప్రయాణికులు

ప్రజావాణికి వినతుల వెల్లువ



ఘట్‌కేసర్: ప్రజావాణిలో ధరఖాస్తులు స్వీకరిస్తున్న కమిషనర్ సాబేర్‌అలీ

ఘట్‌కేసర్, జూన్ 10: ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల్లో సోమవారం జరిగిన ప్రజావాణిలో ప్రజలు పెద్దఎత్తున వినతులు సమర్పించారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో 27, పోచారం మున్సిపాలిటీలో 10 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. ఈ దరఖాస్తుల్లో అధికశాతం వంట గ్యాస్ సబ్సిడీకి గృహజ్యోతిపై వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డులో లక్షల రూపాయలు వెచ్చించి డ్రైనేజీ నిర్మించిన మురుగునీరు దిగువకు వెళ్లకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని టీచర్స్‌కాలనీ వాసులు ప్రజావాణిలో చేసిన ఫిర్యాదులో వివరించారు. పాత డ్రైనేజీని అలాగే వదిలేయడంతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పల్లె విజయ్ వివరించారు. 15వ వార్డులో డ్రైనేజీ నిర్మించి పనులు ముగిసిన డ్రైనేజీకి చేసిన తవ్వకాలను పూడ్చక పోవడంతో వాహనదారులు నిత్యం తీవ్ర అవస్థలు పడాల్సివస్తోందని వివరించారు. తక్షణమే చర్యలు చేపటి ఇబ్బందులు తీర్చాలని బర్ల హరిశంకర్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోని సర్వేనెంబర్లు 410, 417లోని అనుమతిలేని లేఅవుట్‌లలో విరుద్ధంగా ఇళ్ల నిర్మాణం చేస్తున్నారని అబ్బసాని సురేష్ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. మున్సిపల్ అధికారులు నిర్మాణదారులతో కుమ్మక్కై అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని వాపోయారు.

కీసర రూరల్: ప్రజాసమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్లు రాజేందర్‌కుమార్, రాజమల్లయ్యలు అన్నారు. ఇరు మున్సిపల్ కార్యాలయాల్లో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగారంలో ఆరు, దమ్మాయిగూడలో ఏడు ఫిర్యాదులు వచ్చాయి. వీటిల్లో అధికంగా టౌన్ ప్లానింగ్‌కు సంబంధించినవి కాగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు వినతి పత్రాలు అందజేశారు. అదేవిధంగా ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ బిల్‌కలెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీల్లో అధికంగా టౌన్ ప్లానింగ్‌కు సంబంధించిన సమస్యలే అధికంగా ఉంటాయి. కాగా ఆశాఖకు సంబంధించిన అధికారులే ప్రజావాణికి హాజరు కాకపోవటం చర్చనీయాంశంగా మారింది. ఈ కార్యక్రమంలో డీఈఈలు రఘు, చిరంజీవులు, మేనేజర్లు చంద్రశేఖర్, వెంకటేశం, సానిటరీ ఇన్‌స్పెక్టర్లు రాంరెడ్డి, ప్రభు పాల్గొన్నారు.

డబ్బులు దుర్వినియోగంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

బొంరాస్‌పేట్: మండలంలోని బురానపూర్ వరి కొనుగోలు కేంద్రం కమిషన్ డబ్బులు డ్రాచేసి మహిళా సంఘం లీడర్లు సీసీ భీమయ్య పంచుకున్నట్లు బొంరాస్‌పేట్ మండల మహిళా సమాఖ్య కార్యదర్శి భాగ్యమ్మ చిన్న సంఘం సభ్యులతో కలిసి సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామ సంఘం ఉన్న చిన్న సంఘాలకు ఎలాంటి సమాచారం లేకుండా గుట్టుగా అకౌంట్ నుంచి డ్రా చేసి సభ్యులు తెలియకుండా పంచుకున్నారని ఆరోపించారు. అకౌంట్ నుంచి డ్రా చేయాలంటే సంఘంలో ఉన్న చిన్న సంఘాల తీర్మానం చేస్తూ దానికి సంబంధించిన రశీదు ఓచర్లు జతచేసి డ్రా చేసేందుకు వీలుంటుందన్నారు. ఇవన్నీ మర్చిపోయి అంతా మా ఇష్టం అనే విధంగా డబ్బులు డ్రా చేసి దుర్వినియోగం చేయడమేంటని ప్రశ్నించారు. స్పందించిన కలెక్టర్ విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగ్యమ్మ, లక్ష్మి, మమత, సరస్వతి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా గతంలో ఇదే మాదిరిగా డబ్బులు దుర్వినియోగం జరగడంతో అధికారులు విచారణ జరిపి ఏపీఎం, డీపీఎంను సస్పెండ్ చేసినట్లు తెలిపారు. తిరిగి ఇలాంటి సంఘటన పునరావృతం కావడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



కలెక్టరేట్ వద్ద మహిళా సమాఖ్య కార్యదర్శి భాగ్యమ్మ, సభ్యులు

వ్యవసాయేతర భూమికి రైతుబంధుపై ఫిర్యాదు

బషీరాబాద్: వ్యవసాయేతర భూమికి రైతుబంధును నిలిపివేయాలని మంతట్టి గ్రామస్తులు పలువురు ప్రజావాణిలో తహసీల్దార్ వై.వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశారు. 25 ఏళ్ల కిందట ప్రభుత్వం పేదలకు భూమి కొనుగోలు చేసి భూములు ఇస్తే ఆ భూమిలో ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు కట్టుకున్నామన్నారు. కాగా ధరణిలో మాత్రం పట్టా భూమిగా కొనసాగుతూ వస్తోందన్నారు. అంతేకాకుండా సదరు భూ యజమాని కూతురు పేరిట ధరణిలో పేరు మారి రైతుబంధు కూడా వస్తోందని తహసీల్దార్‌తో వారు మొరపెట్టుకున్నారు. ఈ భూమిలో ఇప్పటికే 85ఇళ్ల నిర్మాణాలు ఉన్నాయన్నారు. ఆ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చి తమకు న్యాయం చేయాలని బాధితులు తహసీల్దార్‌ను కోరారు. ఇందుకు తహసీల్దార్ స్పందిస్తూ వెంటనే ఆర్‌ఐతో విచారణ జరిపిస్తానని ఎవరూ ఆందోళన చెందవద్దని గ్రామస్తులకు సూచించారు.



బషీరాబాద్ ప్రజావాణిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మంతట్టి గ్రామస్తులు

క్రైం కార్నర్

క్వింటాల్ నకిలీ విత్తనాల పట్టివేత

యాలాల, జూన్ 10: మండలంలోని పగిడాల గ్రామానికి చెందిన కొత్త కిష్టప్ప వద్ద నకిలీ విత్తనాలు పట్టుబడినట్లు ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. అతడి వద్ద ఒక క్వింటాల్ నకిలీ విత్తనాలను గుర్తించామన్నారు. ఈ మేరకు వాటిని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. వ్యవసాయాధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు. వాటిని కోస్గి మండలం కొత్తపల్లి చెందిన నరేష్ వద్ద కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైనట్లు తెలిపారు. ఈ మేరకు నకిలీ విత్తనాలను విక్రయించిన నరేషపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



యాలాలలో పట్టుబడిన నకిలీ విత్తనాలు

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

తాండూరు రూరల్, జూన్ 10: రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన తాండూరు-మంతట్టి రైల్వేస్టేషన్ మధ్యలో చోటుచేసుకుంది. తాండూరు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వై.వీరేశం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సాయంత్రం తాండూరు-మంతట్టి రైల్వే స్టేషన్ మధ్యన సోమవారం ఓ గుర్తుతెలియని రైలు గుర్తుతెలియని వ్యక్తిని ఢీకొట్టింది. దీంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి ఒంటిపై నీలిరంగు షర్టు ధరలించి ఉన్నాడని తెలిపారు. గుర్తించిన వారు సెల్ 8712513854 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. వికారాబాద్ స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృత్యువాత

పూడూరు, జూన్ 10: విద్యుదాఘాతంతో ఆవు మృత్యువాతపడింది . ఈఘటన మండలంలోని ఎన్కెపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కిష్టం గోపాల్ అనే రైతు సోమవారం తన ఆవును మండలంలోని హిట్స్ కాలేజీ సమీపంలో మేత కోసం తీసుకెళ్లాడు. అక్కడ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై ఆవు మృత్యువాతపడింది. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే తన ఆవు మృతిచెందిందని బాధితుడు రైతు కిష్టం గోపాల్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఆవు విలువ రూ.60వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరారు.



ఎన్కెపల్లిలో మృత్యువాతపడిన ఆవు

కుక్కల దాడిలో జింకకు గాయాలు

● ఫారెస్టు అధికారులకు అప్పగింత

బొంరాస్‌పేట్/కొడంగల్, జూన్ 10: మండలంలోని పాలబావి తండా సమీపంలో సోమవారం ఉదయం కుక్కలు ఓ జింకను వెంటాడుతుండగా ఆ తండావాసులు గమనించి జింకను బంధించారు. అనంతరం కొడంగల్ ఫారెస్టు అధికారులకు అప్పగించారు. విషయం తెలుసుకున్న వికారాబాద్ జిల్లా లంబాడి హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు సూర్యనాయక్ తండాకు చేరుకొని బులేరో వాహనంలో జింకకు కొడంగల్ ప్రభుత్వ పశువైద్యశాలలో చికిత్స చేయించారు. అనంతరం ఫారెస్టు కార్యాలయంలో అకారులకు జింకను అప్పగించారు. ఈ కార్యక్రమంలో అరుణ్‌నాయక్, రాజునాయక్, శ్రీనునాయక్, సూర్యనాయక్, పునిబాయి, చందర్‌నాయక్, రమేశ్‌నాయక్, దన్ను నాయక్ పాల్గొన్నారు.



అధికారులకు జింకను అప్పగించిన తండావాసులు

మంత్రి తుమ్మలను కలిసిన ఎమ్మెల్యే



తాండూరు, జూన్ 10 : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును సోమవారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. టీఎస్‌సీఏబీ చైర్మన్ రవీందర్ రావు, వైస్ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్యలు కొత్తగా ఎన్నికైన సందర్భంగా మంత్రిని ఎమ్మెల్యే వారిని వెంట తీసుకెళ్లి మంత్రిని కలిశారు. కాగా, టీఎస్‌సీఏబీ చైర్మన్‌గా రవీందర్‌రావు, వైస్‌చైర్మన్‌గా కొత్త కుర్మ సత్తయ్య ఎన్నికైన సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి వారిని అభినందించారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించం



కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీస్ ఏసీపీ

మేడ్చల్ టౌన్, జూన్ 10: ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే ఉపేక్షించబోమని మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపై తిరుగుతున్న 16వాహనాలను పోలీసులు పట్టుకుని వాహన యజమానులకు సోమవారం పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నెంబర్ ప్లేట్లు సరిగా లేని వాహనాలకు కొత్త నెంబర్ పేట్లను అమర్చి సదరు వాహనాల యజమానులకు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ట్రాఫిక్ సీఐ హనుమాన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ రోడ్డు వేయాలి

పూడూరు, జూన్ 10: మండలంలోని అంగడిచిట్టెంపల్లి నుంచి లాల్‌పహాడ్ వరకు డబుల్ రోడ్డు వేయాలని కోరుతూ బీజేపీ నాయకులు ఏఈవో మహేష్‌కు వినతిపత్రం అందజేశారు. బీజేపీ నాయకులు సోమవారం ఆర్‌అండ్‌బీ ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ సురేందర్‌ను కలిసి విన్నవించారు. కంకల్ నుంచి లాల్‌పహాడ్ వరకు రోడ్డు మరీ దారుణంగా తయారైందని తెలిపారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయించాలని వారు కోరారు.

మైనార్టీ బాలుర గురుకుల కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, జూన్ 10: మైనార్టీ బాలుర గురుకుల కళాశాల మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ పకీరా రాత్లావత్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి గానూ ఎంపీసీ గ్రూప్‌లో 4, బైపీసీ గ్రూప్‌లో 4సీట్లు మొదటి సంవత్సరంలో ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందాల్సిన విద్యార్థులు జూన్ 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మిగితా వివరాలకు 9959746436, 7331170809 ఫోన్ నెంబర్ల ద్వారా సమాచారం నిమిత్తం సంప్రదించాలని సూచించారు.

కేంద్ర మంత్రులను కలిసిన నాయకులు



కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను సన్మానిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేష్

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 10: కేంద్రమంత్రిగా నియమితులైన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను, సోమవారం ఢిల్లీలోని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి కలిసి శాలువాలతో సన్మానించారు. అలాగే మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, మెదక్ ఎంపీ రఘునందన్‌రావులను కలిసి ఆయన సన్మానించారు. ఎంపీపీతో పాటు బీజేపీ నాయకుడు గొంగళ్ళ బాలేష్ తదితరులు పాల్గొన్నారు.

తాండూరు: కేంద్ర మంత్రలుగా ప్రమాణ స్వీకారం చేసిన కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను జిల్లాకు చెందిన బీజేపీ నేతలు సోమవారం సన్మానించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు.రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు శివరాజ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, కౌన్సిలర్ సాహు శ్రీలత, బీజేపీ పట్టణ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్‌లు సన్మానించారు. నరేంద్ర మోడీ మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా సోమవారం కౌన్సిలర్ బంటారం లావణ్య భద్రేశ్వర్ 31వ వార్డులో స్వీట్లు పంపిణీ చేశారు.

పరిగి: కేంద్రమంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను సోమవారం పరిగి బీజేపీ నాయకులు కలిశారు. ఢిల్లీలో ఉన్న మంత్రులను పరిగి బీజేపీ నాయకులు వేముల పెంటయ్య, రాముయాదవ్, బాలకిష్టరెడ్డిలు కలిశారు. మోదీ ప్రభుత్వంలో తెలంగాణకు మంత్రి పదవులు ఇచ్చిన ఇద్దరు నేతలను సన్మానించారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేత



ప్రతిభా పురస్కారంతో జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని నీతిక, హెచ్ఎం గౌరీశంకర్

మోమిన్‌పేట్, జూన్ 10: మండలంలోని మేకవనంపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని నీతిక, ఆ పాఠశాల హెచ్ఎం గౌరీశంకర్ సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రతిభా, శ్రేష్ఠ పాఠశాల పురస్కారాలు అందుకున్నారు. రవీంద్ర భారతిలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో నీతిక పాఠశాల హెచ్ఎం గౌరీశంకర్‌తో కలిసి ఈ పురస్కారం అందుకున్నారు. గత విద్యా సంవత్సరం నిర్వహించిన పదో తరగతి పరీక్షల్లో ఆమె 10 జీపీఏ సాధించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆమెను హైదరాబాద్ ఆహ్వానించి సన్మానించింది. ప్రధానోపాధ్యాయుడు గౌరీశంకర్, ఉపాధ్యాయుడు వేణుగోపాల్ తదితరులు శ్రేష్ఠ పాఠశాల ప్రతిభా అవార్డులతో సన్మానించారు.

కీసర: పదవ తరగతిలో 10/10జీపీఏ సాధించిన కీసర జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థి కె.రామ్‌చరణ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సోమవారం నగరంలోని రవీంద్ర భారతిలో సీఎం చేతుల మీదుగా సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జిల్లాకు చెందిన కీసర జడ్పీహెచ్ఎస్ విద్యార్థి కె.రామ్‌చరణ్‌ను ఎంపిక చేసి సీఎం చేతుల మీదుగా ప్రశంసాపత్రంతో పాటు జ్ఞాపికను అందజేశారు.

విద్యార్థులకు కలెక్టర్ అభినందన

వికారాబాద్: జాతీయ స్థాయి నీట్‌పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కలెక్టర్ సి. నారాయణరెడ్డి అభినందించారు. వికారాబాద్ జిల్లా మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు జాతీయస్థాయిలో నిర్వహించిన నీట్ 2024 పోటీ పరీక్షల్లో నలుగురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. అందులో ఎండీ ఫరాన్, సయ్యద్ సోహెల్, సంతోష్ కుమార్, ఎండీ ఫిర్దోస్‌లు ఉన్నారు. వీరిని సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సి.నారాయణరెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి హన్మంత్ రావు, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి శంకర్ నాయక్, కళాశాల ప్రిన్సిపల్ పకీరా రాత్లావత్‌లు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించి శాలువాతో సన్మానించారు. 2023-24 విద్యా సంవత్సరానికి ఇంటర్ పరీక్షల్లో మొదటి రెండవ సంవత్సరంలో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన మైనార్టీ బాలుర గురుకుల కళాశాల విద్యార్థులను కలెక్టర్ అభినందించారు.



నీట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు కలెక్టర్ సన్మానం

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



పరిగి: విద్యారణ్యపురిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పరిగి, జూన్ 10: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని పీఆర్టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి డి.అమర్‌నాథ్ అన్నారు. బడిబాటలో భాగంగా సోమవారం జడ్పీహెచ్ఎస్‌నె.02 ఉపాధ్యాయులు మున్సిపల్ పరిధిలోని విద్యారణ్యపురి, చిగురాల్‌పల్లి, గోవిందాపూర్, కిష్టమ్మగుడితండాల్లో ఇంటింటికీ తిరిగి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ప్రచారాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, శ్రీనివాసరావు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఉపాధ్యాయులు కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా కొడంగల్ మున్సిపల్ పరిధిలోని పాత కొడంగల్‌లో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఎరన్‌పల్లిలో ఉపాధ్యాయులు బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు క్రాంతికుమార్, సంధ్య, విష్ణు, వీరేశం గౌడ్, వెంకటయ్య, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమ: బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం దోమ మండలంలోని బొంపల్లి ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ పరిధిలోని బాసుపల్లి తదితర పాఠశాలల్లో బడిబాట ర్యాలీలు నిర్వహించారు. ఎంపీడీవో మహేశ్‌బాబు, ఎంఈవో హరిశ్చంద్ర బడిబాట ర్యాలీలో పాల్గొని ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

కులకచర్ల: బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని జడ్పీటీసీ రాందాస్ నాయక్ తెలిపారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమంలో భాగంగా బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని చౌడాపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులందరికి పాఠశాలల్లో ఉచితంగా యూనిఫాంలు, పుస్తకాలు, నోట్‌బుక్‌లు, మధ్యాహ్న భోజనం తదితర సౌకర్యాలను కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చౌడాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం తిమ్యానాయక్, సీనియర్ అసిస్టెంట్ లింగప్ప, పాఠశాల కమిటీ చైర్మన్ కొత్త ఆలవేలు, మహిళా సమాఖ్య కార్యదర్శి సాయిలమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'భగీరథ' నీళ్లు తాగాలి

తాండూరు రూరల్, జూన్ 10: గ్రామాల్లో ప్రజలు మిషన్ భగీరథ నీళ్లు తాగాలని తాండూరు ఎంపీడీవో విశ్వప్రసాద్ అన్నారు. మండలంలోని గోనూరు గ్రామంలో ఎంపీడీవో పర్యటించారు. ఈ సందర్భంగా విశ్వప్రసాద్ మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో మిషన్ భగీరథ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో ఇంటికి 100 లీటర్ల వరకు భగీరథ నీటిని సరఫరా చేయాలన్నారు. మిషన్ భగీరథ నీళ్లు వాడుతున్నారా లేదా, ఎందుకు వాడటం లేదనే విషయాలతో కూడిన పూర్తి నివేదిక కలెక్టర్‌కు పంపిస్తామని ఎంపీడీవో చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీవో నరోత్తంరెడ్డి, ఈసీ మధుసూదన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రషీద్ తదితరులు ఉన్నారు.

బషీరాబాద్: మండలంలోని ఆయా గ్రామాల్లో మిషన్ భగీరథ పథకంపై అధికారులు ఇంటింటి సర్వేకు శ్రీకారం చుట్టారు. సోమవారం బషీరాబాద్ ఎంపీడీవో రాఘవులు మైల్వార్ గ్రామంలో ఇంటింటికి వెళ్లి మిషన్ భగీరథ పథకం అమలు తీరును పరిశీలిస్తూ ఆయా కుటుంబాలతో నీరేలా వస్తుందని ఆరా తీశారు. మండల వ్యాప్తంగా ఆయా గ్రామాలు, గిరిజన తండాల్లో ఉన్న 13,129 మిషన్ భగీరథ నీటి కనెక్షన్లను సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట స్థానిక నాయకుడు సోంపల్లి బిచ్చిరెడ్డి తదితరులు ఉన్నారు.



మైల్వార్‌లో వివరాలు నమోదు చేసుకుంటున్న ఎంపీడీవో రాఘవులు

పెద్దేముల్: మండలంలో ప్రతీ గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రతీ ఇంటికి వెళ్లి ఆఇంటికి నల్లా కనెక్షన్ ఉందాలేదా? అనే విషయాలపై ఆరా తీస్తున్నారు.

సంక్షిప్తంగా..

● **ధారూరు:** మండలంలోని మోమిన్‌కుర్దు గ్రామానికి వికారాబాద్ నుంచి బస్సు సర్వీసును నడిపించాలని మాజీ ఉప సర్పంచు గౌస్, గ్రామస్థులు సోమవారం వికారాబాద్ ఆర్టీసీ డిపో అధికారులకు వినతి పత్రం సమర్పించారు. వికారాబాద్ నుంచి గొట్టిముక్కుల, దాచారం మీదుగా మోమిన్‌కుర్దుకు ఉదయం, సాయంత్రం రెండు ట్రిప్పులు బస్సును నడిపించాలని వారు అధికారులను కోరారు.

● **కులకచర్ల:** చౌడాపూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. పాలమూర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కృష్ణ, క్షయ వ్యాధి నివారణ అధికారి ఎండీ.రఫీక్ ఆదేశానుసారం నవాబుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నరేశ్ చంద్ర క్షయవ్యాధి అనుమానితులను గుర్తించారు. శిబిరంలో 159 మంది క్షయవ్యాధి అనుమానితులను గుర్తించారు. ఈ కార్యక్రమంలో రాములు, శ్రీనివాసులు, శ్రీను, శరభలింగం, వినోద్ పాల్గొన్నారు.

శామీర్‌పేట: హిందువులు ఆధ్యాత్మిక సిద్ధాంతాలను తెలుసుకోవాలని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞానవేధిక హైదరాబాద్ కమిటీ అధ్యక్షుడు గిరి పిలుపునిచ్చారు. బొమ్మరాసిపేట గ్రామంలో సోమవారం గిరి ఆధ్వర్యంలో హిందు త్రైత సిద్ధాంతం గ్రంథాలపై పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాల పట్ల వారు హిందువులకు వివరించారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మ అను మూడు ఆత్మల పట్ల వారు హిందువులకు అవగాహన కల్పిస్తూ ప్రచారం చేశారు. హిందూ ధర్మ బోధనలను తెలుసుకొని పాటించడమే త్రైత సిద్ధాంతం ముఖ్య ఉద్దేశమని ఆయన వివరిస్తూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞానవేధిక హైదరాబాద్ కమిటీ సభ్యులు శ్రీనివాసచారి, జనార్దన్‌రావు, అమరేందర్, ప్రసాద్, విజయ, చిత్రబాను, నవ్యశ్రీ, మధు, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులను బయటకు అనుమతించొద్దు

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 10: ప్రైవేట్ హాస్టళ్ల నిర్వాహకులు విద్యార్థులను రాత్రివేళల్లో బయటకు అనుమతించొద్దని పోచారం ఐటీసీ సీఐ రాజువర్మ హెచ్చరించారు. ఆయన సోమవారం యంనంపేట్‌లోని ప్రైవేట్ హాస్టళ్ల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు.

జీరో బిల్లును వినియోగించుకోవాలి

తాండూరు రూరల్, జూన్ 10: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న జీరో బిల్లును విద్యుత్ వినియోగదారులు సద్వినియోగించుకోవాలని తాండూరు మార్కెట్ కమిటీ మాజీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీనివాస్ అన్నారు. అంతారం గ్రామంలో సోమవారం వినియోగదారులకు జీరో బిల్లు రశీదును అందజేశారు. త్వరలో ఇందిరమ్మ ఇళ్లు కూడా వస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ లైన్‌మెన్ అక్బర్, పీఏసీఎస్ డైరెక్టర్ పెండ్యా నర్సింహులు, రాజు పటేల్, నక్కల పుల్లప్ప, పెండ్యా ప్రకాష్, శేఖర్, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపులను అరికట్టాలి

కొడంగల్ రూరల్, జూన్ 10: కొడంగల్‌తో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో బెల్టుషాపుల్లో మద్యం విక్రయాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌బీ.గుల్షన్ ఆరోపించారు. పార్టీ నాయకులతో సోమవారం కలిసి కొడంగల్‌లో ఎక్సైజ్ సీఐకి వినతి పత్రం అందజేశారు. ఇప్పటికైనా కొడంగల్‌తో పాటు మండలంలో కొనసాగుతున్న బెల్టు షాపులపై ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ రోమాన్, ఎండీ.సర్తజ్‌హుసేన్, ఎండీ.షానవాజ్ హుసేన్, సయ్యద్ బాబా, ఎండీ.ఇబ్రహీం, సయ్యద్ అర్షద్ అలీ ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ

బొంరాస్‌పేట్, జూన్ 10: దుద్యాల మండలంలోని హకీంపేట్ గ్రామానికి చెందిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు సోమవారం చెక్కులు పంపిణీ చేశారు. రెండు, మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఆర్థికసాయం చెక్కులను కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ ఆథారిటీ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా కాంగ్రెస్ నాయకులు ఆవుటి శేఖర్ తదితరులు 76మంది లబ్ధిదారులకు రూ.76లక్షల 8,816 చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎక్మాయిలో ఆలయ భూముల వేలం

బషీరాబాద్, జూన్ 10: మండలంలోని ఎక్మాయి గ్రామం శ్రీ మారుతి దేవాలయం భూములను ఆశాఖ అధికారులు సోమవారం కౌలుకు వేలం వేశారు. స్థానిక ఆలయానికి సంబంధించి సర్వే నంబర్ 116/1లో 8.06 ఎకరాలు, సర్వే నంబర్ 116.2లో 3.14, సర్వేనంబర్ 150-1లో 0.16 గుంటలు, సర్వే నంబర్ 150-2లో 1.05 ఎకరాలు మొత్తం కలిపి 13.01 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని గ్రామ పెద్దల సమక్షంలో బహిరంగా వేలంతో కౌలుకిచ్చేందుకు అధికారులు సమావేశం నిర్వహించారు. దేవాదాయ శాఖ పోలేపల్లి ఎల్లమ్మ దేవస్థానం మేనేజర్ రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేలం జరపగా స్థానికుడు శ్యామప్ప రూ.16,500లకు ఆలయ భూమిని కౌలుకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయశాఖ మండల ఇంచార్జి టి.నరేందర్, జూనియర్ అసిస్టెంట్ శ్యామ్ కుమార్, గ్రామ పెద్దలు పి.శ్రీనివాస్‌రెడ్డి, ఎ.సుదర్శన్, బి.శ్రీనివాస్‌గౌడ్, ఎం.సాయిరెడ్డి, బి.వెంకట్‌రెడ్డి, ఎం.మధు, పి.నర్సప్ప, సుల్తాన్‌పూర్ రాములు, పి.మునీప్రకాష్ రెడ్డి, ఆడ్కెశ్యామప్ప, భీమప్ప తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్‌కు డిగ్రీ కళాశాలలు మంజూరు

కొడంగల్, జూన్ 10: కొడంగల్ నియోజకవర్గానికి పాలమూర్ విశ్వవిద్యాలయం పరిధిలో కొత్తగా రెండు డిగ్రీ కళాశాలలు మంజూరయ్యాయి. అందులో భాగంగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రారంభించే విధంగా ప్రభుత్వం అనుమతులు ఇస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసింది. నియోజకవర్గంలోని కోస్గిలో మహిళా డిగ్రీ కళాశాల, మద్దూర్‌లో కోఎడ్యుకేషన్ డిగ్రీ కళాశాలను మంజూరు చేశారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

కొడంగల్, జూన్ 10: లయన్స్ క్లబ్ ఆఫ్ కొడంగల్, జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ, వైద్య, ఆరోగ్య శాఖ, కందూరి రాంరెడ్డి కంటి ఆసుపత్రి పాలమూర్ వారి ఆధ్వర్యంలో మంగళవారం కొడంగల్‌లో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గురునాథ్‌రెడ్డి, కార్యదర్శి దాసప్ప యాదవ్, కోషాధికారి ముద్దప్పదేశ్‌ముఖ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జరిగే ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.